అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 10 అక్టోబర్ 2024 పేజీలు : 04

-కళ్యాణదుర్గం అభివృద్ధిలో అద్భుతం జరగబోతోంది
-రెండేళ్లలో బిటిపి కాలువల పనులు పూర్తి చేయబోతున్నాం
-ఏ అధికారి అవినీతికి చోటివ్వవద్దు
-నిజాయితీగా పనిచేయండి
-ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజల కోసమే ఉయోగిద్దాం

3,500 ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి

ఎకరాకు రూ.1.10 లక్షలు ప్రభుత్వ సాయం

అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

కళ్యాణదుర్గం కరువు ప్రాంతమని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యంలో నియోజకవర్గానికి 3,500 ఎకరాల్లో పండ్లతోటల సాగుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, ఈ పథకంలో 1,150 మంది రైతులకు, ఎకరాకు రూ.1.10లక్షల అర్థిక సహాయంతో పండ్లతోటల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని,కళ్యాణదుర్గాన్ని హర్టికల్ హబ్‌గా తీర్చిదిద్దుదామని, ఈ పథకాన్ని వచ్చే మార్చి మాసాంతంలోగా రైతులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం రాత్రి ప్రజావేదికలో నియోజకవర్గ మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఎంపిడిఓలు, హార్టికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా హార్టికల్చర్ కోసం 3,500 ఎకరాలు మంజూరు చేస్తే కేవలం కళా్యణదుర్గంకు మాత్రమే మంజూరు చేయడం కళ్యాణదుర్గంకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడం గర్వకారణమని, జిల్లా కలెక్టర్ కూడా ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచడం పట్ల అభినందనలు తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాలలో గొర్రెలు, మేకలు పెంచుకునేందుకు షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వ నిధులు మంజూరు చేస్తోందని, అవసరమైన వారికి ఈ పథకాన్ని అందించాలని సూచించారు. కళ్యాణదుర్గం రైతాంగం కరువుతో బాధలు పడుతున్నారని, రెండేళ్లలోగా బిటిపి-కుందుర్పి బ్రాంచ్ కెనాలు ద్వారా కళ్యాణదుర్గం 114 చెరువులకు సాగునీరు అందించే పథకానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేస్తామన్నారు. కాగా పల్లెల పండుగ కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేది నుండి గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిద్దామని,నియోజకవర్గవ్యాప్తంగా మంజూరు అయిన గ్రామాల్లో సుమారు రూ.12 కోట్లతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు.

అధికారులెవరూ అవినీతికి తావివ్వవద్దు:

కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని, కళ్యాణదుర్గంలో అద్భుత అభివృద్ధి సాగుతుందని, అందరి దృష్టి అభివృద్ధి వైపే సాగాలని,ఎవరైనా తన పేరు చెప్పి అవినీతికి పాల్పడేందుకు సాహసిస్తే అధికారులు అవకాశం ఇవ్వవద్దని ప్రజలకు సేవ చేసి మంచి పేరు తెచ్చుకునేందుకు ప్రజలు ఇచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేయాలని సూచించారు.అవినీతి రహిత పాలనకు అందరూ సహకరించాలని అధికారులకు సూచించారు.

రెండు రోజుల్లో ఈ పంట నమోదు ప్రక్రియపై సూపర్ చెక్‌ను పూర్తి చేయాలి

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ఈ పంట నమోదు ప్రక్రియపై సూపర్ చెక్ ప్రక్రియ రెండు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మతో కలిసి వ్యవసాయ అనుబంధ రంగ సంస్థలైన పట్టు పరిశ్రమ, పశుసంవర్థక, ఉద్యానవనం, ఏపిఎంఐపి, సిరికల్చర్, మార్కెటింగ్, ఫిషరీస్, కో ఆపరేటీవ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ పంట నమోదు ప్రక్రియపై సూపర్ చెక్‌ను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు ఎరువులు అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసే విధంగా ప్రణాళికలు తయారు చేయాలని, రబీ సీజన్‌కు సంబంధించి నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయుటకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 34 కో ఆపరేటీవ్ సొసైటీలు వుండగా అందులో 11 సొసైటీల్లో ఎరువుల అమ్మకాలు జరుగుతున్నాయని మిగిలిన 23 సొసైటీల్లో వచ్చే 30 రోజుల్లో ఎరువుల వ్యాపారం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కోఆపరేటీవ్ సొసైటీల్లో రుణాలు తీసుకున్న రైతులు డేటాకు సంబంధించి కంప్యూటరైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, రోజు పురోగతి వుండాలని ఇందుకు సంబంధించిన రోజువారి నివేదికలు అందించాలన్నారు. పశుసంవర్థకశాఖకు సంబంధించి ఖాళీగా వున్న అసిస్టెంట్ డైరెక్టర్, వెటర్నరీ అసిస్టెంట్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ పోస్టుల వివరాలు తయారు చేసి భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్థకశాఖ సెక్రటరీకి లేఖను తయారు చేసి పంపాలని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగం జరిగే చర్యలు తీసుకోవాలని దీని ద్వారా రైతులకు పంట పండించేందుకు ఖర్చు తక్కువై అధిక ఆదాయం పొందేందుకు వీలవుతుందన్నారు. డ్రోన్ల కార్పోరేషన్లకు ప్రతిపాదనలు పంపాలని అగ్రికల్చర్ హార్టికల్చర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, డిసిఒ అరుణకుమారి, ఫిషరీస్ డిడి శ్రీనివాస్‌నాయక్, పశుసంవర్థశాఖ ఎడి రాధిక, ఏపిఎంఐపి, జిల్లా ఉద్యాన అధికారులు, పట్టు పరిశ్రమశాఖ, వ్యవసాయశాఖ ఏడి రాకేష్, కో ఆపరేటీవ్ ఏడి మార్కెటింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాజరైన అధికారులు

గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు ప్రారంభించండి

- నగర మేయర్ మహమ్మద్‌వసీం, డిప్యూటి మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి

గుంతలు పడిన రోడ్డును పరిశీలిస్తున్న నగర మేయర్, డిప్యూటి మేయర్లు

అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతలు పడ్డాయని వాటికి మరమ్మతు పనులు ప్రారంభించాలని నగర మేయర్ మహమ్మద్‌వసీం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో మేయర్ మహమ్మద్‌వసీం, డిప్యూటి మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డిలతో కలిసి నగరంలోని టవర్‌క్లాక్, ఆర్ట్స్ కళాశాల రోడ్డు, తిలక్‌రోడ్డు, ఉమానగర్, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. నగరంలో దెబ్బతిన్న రోడ్లకు ప్యాచ్ వర్క్ చేయడానికి వెంటనే అంచనాలు తయారు చేసి త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు మేయర్ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్లు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు అభూసాలేహా, కమల్‌భూషణ్, ఎస్ఈ భాస్కర్‌రావు, ఇఇ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు. అలాగే నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అనంతపురం నగరంలోని హెచ్ఎల్‌సి కాలనీలో గల నసనకోట ముత్యాలమ్మ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ముఖ్యఅతిథులుగా అనంత సువర్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ శేఖర్‌బాబు, బిందుప్రియా పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న దృశ్యం

వయోవృద్ధుల పోషణ, సంరక్షణకు చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

వయోవృద్ధుల పోషణ, సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో బుధవారం విభిన్న ప్రతిభావంతుల, హిజ్ర, వయోవృద్ధుల సంక్షేమశాఖ అనంతపురం ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళి-2011పోస్టర్ కరపత్రాలను కలెక్టర్ విడుదల చేశారు.

వయోవృద్ధుల కొరకు జాతీయ కార్యాచరణ

వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం-2007 ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయోవృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళి-2011 సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. పోషణ, నిర్వహణ కొరకు రెవెన్యూ డివిజినల్ అధికారి/ సబ్‌కలెక్టర్ ఆధ్వర్యంలో ట్రిబునల్ నిర్వహణ చేయాలని కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో అప్పిలేట్ ట్రిబునల్ నిర్వహణ చేయాలని వృద్ధాశ్రమాల ఏర్పాటు, పర్యవేక్షణ; నియంత్రణ వుండాలన్నారు. సీనియర్ పౌరులకు మెరుగైన వైద్య సదుపాయం ఏర్పాటు చేయాలని వృద్ధుల జీవనాన్ని ఆస్తులను సంరక్షించే సముచిత యంత్రాంగాన్ని సంస్థాగతం చేయాలన్నారు. వృద్ధులు దేశానికి మూలస్తంభాలని వారిని గౌరవిద్దామని సేవ చేద్దామన్నారు.ఈ కరపత్రాలను జిల్లాలోని ఎంపిడిఒ, మున్సిపల్ కమీషనర్ కార్యాలయాలకు పంపిణీ చేయాలన్నారు. వయోవృద్ధుల సహాయం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 14567, జిల్లా హెల్ప్‌లైన్ నెంబర్ 08554-2323380 ద్వారా వయోవృద్ధుల సమస్యలను తెలియచేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమశాఖ ఏడి రసూల్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న కలెక్టర్

యాడికి వైపు నుంచి నంద్యాలకు తరలిపోతున్న చౌక బియ్యం

యాడికిలోని ఓ తోటలో దాచిన చౌక బియ్యం

చౌక దగా ..! నిద్రలో నిఘా..!

- సన్న బియ్యంగా మారుతున్న సామాన్యుని బియ్యం
- బియ్యం గోదాము నుంచి బియ్యం మిల్లుల వరకు 'చౌక'గా దగా
- నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి నెలా రూ. 3 కోట్ల చౌక బేరం
- మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం

తాడిపత్రి, అక్టోబరు 9, ప్రభాతవార్త

ప్రభుత్వం ఎన్నిరకాల సంస్కరణలు తీసుకొస్తున్నా..అక్రమాలకు అంతు లేకుండా పోతోంది. లబ్ధిదారుల కళ్లముందే మోసాలు జరిగిపోతున్నా ప్రశ్నించలేని పరిస్థితి నెలకొంది. తనిఖీలు చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యపు నీడలో జోగుతున్నారు.క్రమం తప్పకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు. గోదాముల్లో గోల్‌మాల్, డీలర్ల దోపిడీ, కొందరు లబ్ధిదారుల దుర్వినియోగం, దళారుల దందా, మిల్లర్ల మాయాజాలం వెరసి సామాన్యుని బియ్యం సన్న బియ్యంగా మారి ప్రభుత్వ లక్ష్యాన్ని వెక్కిరిస్తున్నాయి.

గోదాముల్లో గోల్‌మాల్

నియోజకవర్గ వ్యాప్తంగా 13,454 క్వింటాళ్ల చౌక బియ్యం తాడిపత్రి, గుత్తి, రాయలచెరువు గోదాముల నుంచి 206 చౌక దుకాణాలకు సరఫరా అవుతున్నాయి. గోదాముల్లోని కొందరు కూలీలు నిల్వ ఉంచిన చోట నుంచి లారీలోకి ఎత్తేలోగా కొద్దిపాటి బియ్యం కారిపోయే లాగా చేస్తున్న చర్యలతో పాటు గోదాముకు చేరక ముందే కొద్దిపాటి తేడాలుండటంతో 50 కిలోల బస్తా 48 నుంచి 49 కిలోలే తూగుతోంది. సగటున 1.5 కిలోలు తక్కువ తూకం వస్తుండటంతో ప్రతి నెలా 100 క్వింటాళ్లకు పైగా గోదాముల్లోనే గోల్‌మాల్ జరుగుతోంది. నల్లబజారులో వీటి విలువ రూ. 2.86 లక్షలు ఉంటోంది. ఆ లెక్కన ఏడాదికి రూ. 34 లక్షలకు పైగా ప్రభుత్వ ధనం పక్కదారి పడుతోంది. వీటిపై డీలర్లు ఎన్ని ఫిర్యాదులు చేసినా అధికారులు తామేమీ చేయలేమని చేతులెత్తేస్తున్నారు. ఆ ప్రభుత్వం ఈ ప్రభుత్వమని కాదు దశాబ్దాలకు పైగా ప్రజా పంపిణీలో ఇదే తంతు కొనసాగుతోంది.

బుగ్గవైపు నుంచి రాయలచెరువుకు అక్రమ బియ్యం రవాణా

దుకాణాల్లో 'చౌక' దగా..!

ఒక్కో లబ్ధిదారునికి 5 కిలోల చొప్పున 87,686 కార్డుల్లోని 2,69,086 మంది లబ్ధిదారులకు ప్రతి నెలా 13,454 క్వింటాళ్ల బియ్యం పంపిణీ జరుగుతోంది. ఎలక్ట్రానిక్ కాటాలని చెబుతున్నా కొందరు డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తూనికలు కొలతల శాఖదే పర్యవేక్షణ అని..ఇది మనకు సంబంధించిన విషయం కాదన్నట్లు పౌరసరఫరాల శాఖ భావిస్తోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని దుకాణాల్లో ఎలక్ట్రానిక్ కాటాల మీద డబ్బాబరువును బియ్యం బరువుతో కలిపేయడం, మరికొన్ని చోట్ల కిలో బియ్యం మూటకట్టి యంత్రం మీద ఉంచి కార్డుదారులకు ఆ బరువుతో పాటు తూకం వేసి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తాము గోదాముల్లో నష్టపోతున్న బియ్యాన్ని కార్డుదారుల నెత్తిన వేసి రాబట్టుకుంటున్నట్లు డీలర్లు బహిరంగంగా చెబుతున్నా అధికారులు ఏమీ చేయలేని స్థితిలో ఉండటంతో చౌక దగా దర్జాగా సాగిపోతోంది.చౌక దుకాణాల్లో బియ్యాన్ని నొక్కేయడంతో సగటున కార్డుకు కిలో వంతున 87,686 కార్డులకు 876 క్వింటాళ్ల కార్డు దారులకు దూరమవుతున్నాయి. నల్లబజారులో వీటి విలువ రూ. 23.67 లక్షలుంటోంది. ఏడాదికి ఈ దందా 2.84 కోట్లకు చేరుతోంది. తూకంలో కోత విధించి బియ్యం నొక్కేస్తున్నారని డీలర్లపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.

దారి మళ్లుతున్న బియ్యం..దళారులదే రాజ్యం

సన్నబియ్యం ధరలకు రెక్కలు రావడంతో మిల్లర్లు, దళారులు కొత్త తరహా మోసాలకు తెరలేపుతున్నారు. తాడిపత్రి, యాడికి, రాయలచెరువుల్లోని దళారులు గ్రామ స్థాయిలో బ్రోకర్లను ఏర్పాటు చేసుకొని లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి మిల్లులకు సరఫరా చేస్తుండగా అక్కడి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థతో పాలిష్ చేసి సన్న బియ్యంగా మార్చి విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. లబ్ధిదారుల నుంచి కిలో రూ. 18 లు వంతున బ్రోకర్లు కొని దళారులకు రూ. 24 లకు విక్రయిస్తున్నారు. లబ్ధిదారులు, బ్రోకర్లు, దళారులు, వ్యాపారులు, మిల్లర్ల మధ్య సాగుతున్న తంతు అవినీతి అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. బ్రోకర్ల నుంచి దళారులకు చేరుతున్న చౌక బియ్యం విషయంలో మాఫియాను తలపించే పోరు సాగుతోంది. తమకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న చౌక బియ్యాన్ని దాదాపు 60 శాతం మంది కార్డుదారులు బ్లాక్ మార్కెట్‌కు విక్రయిస్తున్నారు. ఆ లెక్కన నియోజకవర్గ వ్యాప్తంగా 8 వేల క్వింటాళ్లకు పైగా చౌక బియ్యం బ్లాక్ మార్కెట్‌కు వెళుతోందని తెలుస్తోంది. వీటి విలువ నల్లబజారులో రూ. 2.17 కోట్లు పలుకుతోందని చర్చ సాగుతోంది. తాడిపత్రి, యాడికి, రాయలచెరువుల నుంచే ప్రతి నెలా 30 టన్నుల సామర్థ్యమున్న వాహనాలు 50 నుంచి 70 వరకు జిల్లా సరిహద్దులు దాటుతుంటే, మరి కొన్ని మార్గాల్లో వేల క్వింటాళ్లు తరలిపోతున్నాయని సమాచారం. ఈ అక్రమ వ్యాపారం ఓ కుటీర పరిశ్రమలా మారుతుండటంతో లబ్ధిదారుల నుంచి సేకరించే బ్రోకర్లు పదుల సంఖ్యలో పుట్టుకొస్తున్నారు. వీరి నుంచి బియ్యం కొనుగోలు చేయడానికి కొందరు దళారులు రూ. కోట్లు వెచ్చిస్తుండటం, పోలీసు, రెవెన్యూ, నిఘా అధికారులకు ప్రతి నెలా రూ. లక్షల్లో ముడుపులు ముట్ట చెబుతుండటం సామాన్యులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నియోజకవర్గంలోని ఒక స్టేషన్‌కు మాత్రమే ఇద్దరు వ్యాపారస్తులు ఒక్కొక్కరు నెలకు రూ. 1.60 లక్షలు ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయంటే చౌక బేరం ఏ స్థాయిలో సాగుతోందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇతర శాఖల అధికారులకు ఇచ్చే మామూళ్లు వీటికి అదనమని ఆ దళారులు మధ్యవర్తుల దగ్గర వాపోతున్నట్లు తెలుస్తోంది. నిఘా నిద్రపోవడం వల్లే 'చౌక' దగా రాజ్యమేలుతోందని, జిల్లా స్థాయి అధికారులు ఈ దందాపై దృష్టి సారించాలని ప్రజాస్వామ్య వాదులు పేర్కొంటున్నారు.

అట్టహాసంగా అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవం

- ఎంపి అంబికా లక్ష్మినారాయణతో కలసి రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే అమిలినేని
- వేలాదిగా తరలివచ్చిన నాయకులు,కార్యకర్తలు-ప్రజలు

అన్నా క్యాంటీన్‌ను ఎంపితో కలసి ప్రారంభో త్సవం చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ప్రజలకు అహారాన్ని వడ్డిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

కళ్యాణదుర్గంలో నూతనంగా నిర్మించిన అన్నా క్యాంటీన్‌ను బుధవారం అనంతపురం ఎంపి అంబికా లక్ష్మినారాయణతో కలసి స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రిబ్బన్ కట్ చేసి ప్రారంభోత్సవం చేసారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేసారు. అలాగే సర్వమత ప్రార్థనల్లో భాగంగా ముస్లింలు, క్రిస్టియన్లు కూడా ప్రత్యేక ప్రార్థనలు చేసారు. అనంతరం పెద్దఎత్తున ఎంతో అసక్తిగా వచ్చిన ప్రజలకు స్వయంగా ఎంపి అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే అమిలి నేని సురేంద్రబాబు, ఇన్‌ఛార్జి అర్‌డిఓ డిప్యూటీ కలెక్టర్ వినూత్న, మున్సిపల్ కమీషనర్ వంశీకృష్ణ తదితరులు అన్నా క్యాంటీన్ భోజనాన్ని వడ్డన చేసారు. అన్నా క్యాంటీన్ అహారం కోసం ప్రజలు ఎగబడ్డారు. అనంతరం ఎంపి,ఎమ్మెల్యే అర్‌డిఓలు అన్నా క్యాంటీన్ భోజనాన్ని రుచి చూసారు. కేసరిబాత్,చిత్రాన్నం, మసాల కూర, పెరుగుపచ్చడి,అవకాయ లాంటి అహార పదార్థాలతో సాగిన పండుగ భోజనాన్ని ప్రజలు ఎంతో అసక్తిగా భుజించారు. అనంతరం ఎంపి అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబులు విలేఖరులతో మాట్లాడుతూ పేదవారి కడుపు నింపేందుకు తెలుగుదేశం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తూ కేవలం రూ.5లకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం-రాత్రి భోజనాలను అందిస్తున్న వైనం ప్రజల మనస్సులను తాకుతోందని, అలాంటి అన్నా క్యాంటీన్లను గత వైకాపా ప్రభుత్వం రద్దు చేసి పేదల కడుపు కొట్టిందన్నారు. టిడిపి కూటమి అధికారంలోకి రాగానే పేదవాడి కోసం తిరిగి అన్నా క్యాంటీన్లను ప్రారంభించడం ఎంతో సంతోష ంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, శివశంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్లు వై.పి.రమేష్, బిక్కి రామలక్ష్మి గోవిందప్ప,కరణం మల్లికార్జున బాబు,బుట్నా తిమ్మరాజు,బిజెపి కన్వీనర్ ముప్పూరి దేవరాజ్, మల్లారెడ్డి,చక్కా సుబ్రమణ్యం, సోము,జనసేన నాయకులు రాజేష్, వీరమహిళలు,వేలాది తరలివచ్చిన తెలుగుదేశం నాయకు లు,కార్యకర్తలు మహిళా నాయకురాళ్లు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

ప్రణాళిక బద్ధంగా ప్రజలకు సేవలు అందిస్తాం

కార్యక్రమంలలో అవగాహన కల్పిస్తున్న కార్యదర్శి రమణ

డి.హీరేహాళ్, అక్టోబర్ 09 ప్రభాతవార్త:

ప్రణాళిక బద్ధంగా గ్రామ పంచాయితీలో అందించాల్సిన సేవలపై ప్రజా ప్రతినిధులకు ఎంపిడిఓ దాస్‌నాయక్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. బుధవారం డి.హీరేహాళ్ మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో 16పంచాయితీల పరిధిలో ఉన్న ఉప సర్పంచులు, ఇద్దరేసి వార్డుసభ్యులకు ఎంపిడిఓ ఆధ్వర్యంలో సాధారణ పాలన విధానంపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసి పలు అంశాలను తెలిపారు. ఈ నేపథ్యంలో డి.హీరేహాళ్ పంచాయితీ సీనియర్ కార్యదర్శి హాలో వెంకటరమణ విక్షణ కార్యక్రమంలో ప్రతి గ్రామ పంచాయితీలో ప్రజల అవసరాలు నిమిత్తం దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలని ఆయన సభ్యులకు చెప్పారు. ముందుగా గ్రామాలోన్ల ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా సత్వరం తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సాధారణ పరిపాలన, పారిశుద్ధ్యం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పాలనాధికారి బలరాంరావు, ఈఓపిఆర్డీ నాగభూషణం, ఆయా పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయితీ రాజ్ చట్టంలోని వివిధ అంశాలపై శిక్షణా

గుమ్మఘట్ట, అక్టోబర్ 09 ప్రభాతవార్త:

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఓ

పంచాయితీ రాజ్ చట్టంలోని వివిధ అంవాలపై ఎంపిడిఓ రామకృష్ణ స్థానిక ప్రజా పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో వార్డు సభ్యులకు, ఉప సర్పంచులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనతరం ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం రెండు రోజుల పాటు ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు ఎం.భవాని, కార్యాలయం పరిపాలన అధికారి జయరాములు, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే కాలవ వివాహ వార్షికోత్సవ వేడుకలు

రాయదుర్గం, అక్టోబర్ 09 ప్రభాతవార్త:

ఎమ్మెల్యే దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వివాహ వార్షికోత్సవ వేడుకలను నియోజకవర్గంలోని తెదేపా నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో కాలవ శ్రీనివాసులు దంపతులకు పూలమాలలు వేసి, శాలువాలతో ఘనంగా తస్కరించి కేక్‌కటచేయించారు. అనంతరం నియోజకవర్గంలోని పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కాలవ దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా పట్టణాధ్యక్షుడు రాజు,గార్మెంట్‌అసోసియేషన్ అధ్యక్షుడుటంకశాల హనుమంతు, రాయదుర్గం మండల కన్వీనర్ ఎంఆర్ఎఫ్ హనుమంతు, గుమ్మఘట్ట క్లస్టర్ ఇన్‌చార్జ్ కాలువ సన్నన్న, 75వీరాపురం సర్పంచ్ నాగరాజు, తెలుగు యువత అశోక్, నియోజకవర్గంలోని పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎరడికెరలో పాలంపిలుస్తోంది కార్యక్రమం

బ్రహ్మసముద్రం అక్టోబర్09 ప్రభాతవార్త,

పాలంపిలుస్తోంది కార్యక్రమం దృశ్యం

మండలంలోని ఎరడికెరలో పొలంపిలుస్తోంది కార్యక్రమంను ఏఓ సరిత,విహెచ్ఏలు ధనుంజయ,వరుణ్‌తో కలిసి రైతుల పొలాలలోకి వెళ్ళి రైతులకు పంటల సాగుపట్ల మెలుకువలు తెలియజేశారు.అనంతరం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ప్రభుత్వం నుండివచ్చే లబ్ధిని వివరించారు ఎరడికెరలో రైతుల కంది సాగును పరిశీలించి కందిలో పచ్చపురుగు నివారణకు పిచికారిని వివరించారు.రైతులు సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసి మంచి దిగుబధులు పొందాలని వివరించారు.

టిడిపి నేత పసుపులేటి శ్రీనివాసులుకు పితృవియోగం

- నివాళులు అర్పించిన పురం ఎంపి పార్థసారథి

గోరంట్ల, అక్టోబర్ 9 ప్రభాతవార్త



పార్థివదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపి

పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, మేజర్ పంచాయతీ మాజీ వార్డు మెంబర్ పసుపులేటి శ్రీనివాసులు తండ్రి వెంకటేష్ బుధవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న హిందూపురం ఎంపి బికె పార్థసారథి పసుపులేటి శ్రీనివాసులు నివాసానికి చేరుకుని ఆయన తండ్రి భౌతికదేహం పై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతికలగాలని ప్రార్థించి కుటుంబసభ్యులనుపరామర్శించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ ముఖ్యనాయకులు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి నరసింహులు, మండల ప్రధానకార్యదర్శి అశ్వత్థరెడ్డి,ఉమర్‌ఖాన్, బెల్లాల చెరువుచంద్ర, నీలకంఠారెడ్డి, మరువపల్లి వెంకటరంగారెడ్డి, నరేంద్రరాయల్, మేరెడ్డిపల్లి నరసింహులు, కురువ మల్లికార్జున, నివాళులు అర్పించారు.

ఖాళీలకు దరఖాస్తు చేసుకోండి

అగళి, అక్టోబర్ 9 ప్రభాతవార్త : కెజిబివి హాస్టళ్లలో సహాయ వంట మనిషి పోస్టు ఖాళీగా వుందని, మోడల్‌స్కూల్ హాస్టల్‌లో చౌకీదారు పోస్టు ఖాళీగా వుందని ఎంఇఒ భాస్కర్ చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. డిఇఒ సూచన మేరకు పత్రికా ప్రకటన ఇస్తున్నట్లు తెలిపారు. ఈ రెండుపోస్టులకు మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అప్లికేషన్లు నెట్ సెంటర్లలో అందుబాటులో వున్నాయని వాటిని పూర్తి చేసి అగళి ఎంఇఒ కార్యాలయంలో ఈ నెల 15వతేదీ సాయంత్రం 5 గంటలలోపు అందచేయాలని ఆయన తెలిపారు.

ప్రాణం ఉన్నంతవరకు వైసిపిని వీడం

- వైఎస్ జగన్‌ను కలిసిన వైసిపి కౌన్సిలర్లు

హిందూపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో హిందూపురం కౌన్సిలర్లు, నాయకులు

ప్రాణం ఉన్నంత వరకు వైసిపిని వీడమని తిరిగి వైస్‌పి లోకి చేరిన హిందూపురం కౌన్సిలర్లు మల్లికార్జున, పరశురాం, రహమత్‌బి, మణిలు అన్నారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైసిపి జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషాశ్రీచరణ్, హిందూపురం నియోజకవర్గం సమన్వయకర్త దీపిక, వేణురెడ్డిల ఆధ్వర్యంలో కలిశారు. అనంతరం కౌన్సిలర్లు అక్కడ మీడియాతో మాట్లాడుతూ టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే హిందూపురం మున్సిపాలిటీలో కౌన్సిలర్లను భయపెట్టి టిడిపిలోకి చేర్చుకున్నారని హిందూపురం మున్సిపల్‌చైర్మన్ స్థానాన్ని దక్కించుకునే సంఖ్యాబలం టిడిపికి లేకపోవడంతో వైసిపికి చెందిన కౌన్సిలర్లను కొని అడ్డదారిలో హిందూపురం మున్సిపాలిటీని సొంతం చేసుకోవాలని కుట్ర పన్నుతున్నారన్నారు. అధికారపార్టీ నేతల ప్రలోభాలకు బెదిరింపులకు తగ్గేది లేదని ఏది ఏమైనా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతాయని వారు తెలిపారు.

సరస్వతీదేవిగా వాసవిమాత

హిందూపురం టౌన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

హిందూపురం పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీసరస్వతీదేవ అలంకారంలో అమ్మవారు కొలువుదీరారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సరస్వతీదేవి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

సరస్వతి అలంకారంలో దుర్గమ్మ

లేపాక్షి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

లేపాక్షి దుర్గమ్మ బుధవారం సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వీరభద్రస్వామి ఆలయంలో ఉదయం సప్తశతి పారాయణం, రుద్రాభిషేకం, శ్రీచక్ర అర్చన, తదితర పూజలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహశర్మ, శ్రీనివాస్‌కుమార్‌లు స్వామివారి అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దుర్గాదేవికి మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హాజరైన భక్తులకు ఆలయ చైర్మన్ రామానందన్ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సరస్వతీదేవి జన్మనక్షత్రం సందర్భంగా పలువురు చిన్నారులకు పలక బలపం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ నరసింహమూర్తి, దేవాదాయ సహాయకులు మల్లికార్జున, పురావస్తుశాఖ సహాయకులు రాము, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

14 నుండి పల్లె పండుగ కార్యక్రమం

లేపాక్షి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 14 నుండి పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ నరసింహమూర్తి తెలిపారు. 14న కొండూరు బిసి కాలనీలో 10 లక్షలతో సిసి రోడ్డుకు భూమిపూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా కల్లూరు నుండి రాజీవ్‌కాలనీ వరకు 90 లక్షలతో బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన, 15వ అప్రోచ్ 2 కల్లూరు నుండి రాజీవ్‌కాలనీ వరకు 90 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన, అదేవిధంగా బిసలమానేపల్లి నుండి వెంకటాపురం మీదుగా ఓబులాపురం వరకు కోటి రూపాయల వ్యయంతో అప్రోచ్ రహదారి ఏర్పాటు, 16న చోళసముద్రం బిసి కాలనీ, వీవర్స్‌కాలనీల్లో 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, పి.కొత్తపల్లి గ్రామంలోని బిసి కాలనీలో 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ, 17న మండల కేంద్రమైన లేపాక్షిలోని చర్చి ప్రాంతంలో 15 లక్షలతో సిసి రోడ్డు, కంచిసముద్రం ఎస్‌సి కాలనీలో 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ, 18న సిరివారం గ్రామంలోని బస్టాండ్ ప్రాంతంలో 10 లక్షల రూపాయలతో సిసి రోడ్డు, మానేపల్లిలో 10 లక్షలతో సిసి రోడ్డుకు నిర్మాణానికి భూమిపూజ, 19న పి.సడ్లపల్లిలో 10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం, నగిరిగిర మెయిన్‌రోడ్డు నుండి మైదుగోళం గ్రామం వరకు 70 లక్షలతో బిటి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు గేట్స్ విద్యార్థి ఎంపిక

గుత్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి

అనంతపురం జెఎన్‌టియు యూనివర్సిటీ వారు నెల్లూరులోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో సెలక్షన్స్‌లో గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసిఈ మొదటి సంవత్సరం చదువుతున్న వీరశేఖర్ అనే విద్యార్థి ఎంపికైనట్లు జెఎన్‌టియు స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతి, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్ జోయల్ విజయానంద్ విద్యార్థిని అభినందించారు. అలాగే భవిష్యత్తులో జరగబోయే నేషనల్స్‌లో విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.

చెక్‌డ్యాంలో పడి వ్యక్తి మృతి

గుత్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

మండలంలోని బేతాపల్లి గ్రామం వద్ద వున్న ఆర్డీటి చెక్‌డ్యాంలో బోయ నాగరాజు (40) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారిపడి మృతి చెందాడు.

68 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

- ఐచర్, ఆటో స్వాధీనం, ఐదుగురు అరెస్టు

- కచ్చితమైన సమాచారంతో పోలీసుల దాడి

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త

పట్టుబడిన రాయితీ బియ్యం ఐచర్‌వద్ద సీఐ సురేష్‌బాబు సిబ్బంది

పేదలకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకొంటున్న ముఠా గుట్టును రట్టు చేశారు ఉరవకొండ పోలీసులు. కచ్చితమైన సమాచారంతో పట్టణ శివారు రాములమ్మ గుడివద్దగల హనుమాన్ నగర్ ప్రాంతంలో బియ్యాన్ని ఐచర్ వాహనంతోపాటు ఆటోలో లోడ్ చేస్తుండగా దాడులు నిర్వహించి 140 బస్తాల్లోని 68 క్వింటాళ్ల ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన (పీడీఎస్) బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ బి.సురేష్‌బాబు తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే...పీడీఎస్ బియ్యాన్ని అక్రమ వ్యాపారులు కొందరు కర్నాటకకు తరలించడానికి వాహనాల్లో లోడ్ చేస్తున్నారని సమాచారం రావడంతో మంగళవారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో సిబ్బందితో హనుమాన్ నగర్‌కు వెళ్లి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో 68 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకొని ఐచర్, ఆటోను సీజ్ చేయడం జరిగిందన్నారు. బియ్యం అక్రమ రవాణాదారులు లత్తవరం తండాకు చెందిన దేవేంద్రనాయక్ (ఐచర్ వాహనం, బియ్యం యజమాని)తోపాటు ప్యాపిలికు చెందిన సాయికుమార్, శివశంకర్, కొనకొండ్లకు చెందిన నారాయణస్వామి, భవనేష్‌లను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. కేసు నమోదు చేసి పట్టుబడిన బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించగా వారు పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారని సీఐ సురేష్‌బాబు వివరించారు.

ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబర్ 09 ప్రభాతవార్త:

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

కంబదూరు మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపిపి ములకనూరు తలారి తిమ్మరాజమ్మ ఆధ్వర్యంలో మండలంలోని ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు స్థానిక సంస్థల ప్రాథమిక వనరుల వినిమయం పట్ల రెండు రోజుల పాటు శిక్షణా తరగతులను ఏఓ తిప్పయ్య సమక్షంలో నిర్వహించారు. అందులో భాగంగా బుధవారం మొదటి రోజు శిక్షణా తరగతులను నిర్వహించి వార్డులలో కల్పించవలసిన మౌళిక వసతుల పై సభ్యులకు అవగాహన కల్పించారు.

అండేపల్లిలో స్పానిష్ బృందం సందడి

కళ్యాణదుర్గం రూరల్, అక్టోబర్ 09 ప్రభాతవార్త:

పేదల ఇళ్లను ప్రారంభిస్తున్న విదేశీయులు

కంబదూరు మండల పరిధిలోని అండేపల్లి గ్రామంలలో బుధవారం విదేశానికి చెందిన 32మంది స్పానిష్ బృందం సందడి చేశారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో ఆర్డీటి సంస్థ సాయంతో పేదలు నిర్మించుకున్న నూతన ఇళ్లను వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం అదృష్టంగా బావిస్తున్నామని తెలిపారు. పేదలు అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, రీజనల్ డైరెక్టర్ సుబ్బారావు, ఏటిఎం నారాయణస్వామి, అండేపల్లి గ్రామస్థులు, లబ్దిదారులు, ఆర్డీటి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ అమ్మవారి చండీ హోమం

మడకశిర అక్టోబర్ 09 ప్రభాతవార్త:

ప్రత్యేక అలంకరణలో గంగమ్మ అమ్మవారు, చండీ హోమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ రాధమ్మ ఆంజనేయులు

మండల పరిధిలోని చందకచర్ల గ్రామంలో మాజీ సర్పంచ్ శ్రీమతి రాధమ్మ ఆంజినేయులు ఆధ్వర్యంలో గంగమ్మ అమ్మవారి చండీ హోమంను వేద మంత్రాలతో బుధవారం ఘనంగా నిర్వహించారు. దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏడవరోజు గంగమ్మ అమ్మవారిని శ్రీసరస్వతి అమ్మవారి రూపంలో ప్రత్యేకంగా అలంరించి ప్రత్యేకంగా పూజలు జరిపించారు. మూడు రోజుల పాటు చండీ హోమాన్ని జరిపిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

సీనియర్ కమ్యునిష్టు నాయకుడు దూపంపల్లి బాష మృతి

కొత్తచెరువు,అక్టోబర్ 09, ప్రభాతవార్త

దూపంపల్లి బాష (ఫైల్‌ఫోటో)

కొత్తచెరువు మండల కేంద్రంలోని బిసి కాలనీలో నివాసముంటున్న సిపిఎం పార్టీ సీనియర్‌నాయకుడు దూపంపల్లి బాష అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం తుది శ్వాస విడిచారు. ఆ పార్టీ నాయకులు ఆయన స్వగృహంకు చేరుకొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తమప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. గతంలో ఆయన పార్టికి చేసిన సేవలు గర్తుకు చేసుకున్నారు. నిరుపేదల సమస్యల పట్ల బాగా స్పందించే నాయకుడని, ఆ పార్టీ నాయకులు తెలిపారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఈ.ఎస్.వెంకటేష్, బ్యాళ్ళ అంజి, ముత్యాలు, శంకర్ రెడ్డి, శ్రావణి, సిద్దు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

12న శిల్పారామంలో ఘనంగా దసర ఉత్సవాలు

జబర్దస్త్ ఫేం బుల్లెట్‌భాస్కర్, నరేష్, ఫహిమలు

పుట్టపర్తి (కలెక్టరేట్), అక్టోబర్ 09, ప్రభాతవార్త

ఈ నెల 12వ తేదిన శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని శిల్పారామం నందు విజయదశమి పండుగను పురస్కరించుకొని దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 04:00 గంటల నుండి రాత్రి 08:00 గంటల వరకు జబర్దస్త్ కళాకారులైన బుల్లెట్ భాస్కర్, నరేష్, ఫహిమాలచే గొప్ప కామెడీషో,చిత్తూరు జిల్లా కళాతరంగిణి సంస్థ కళాకారులచే డిజె పాటలతో నృత్యప్రదర్శనలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి పట్టణ పెద్దల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కావున పుట్టపర్తి పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున విచ్చేసి విజయవంతం చేయాలని ఆయనకోరారు.

ప్రధాన కేసులన్నింటిపై ప్రత్యేక దృష్టి సారించండి

- జిల్లా ఎస్‌పి వి.రత్న

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి వి.రత్న , హాజరైన డిసిఆర్‌బి సిబ్బంది

పుట్టపర్తి, అక్టోబర్ 09,ప్రభాతవార్త

శ్రీసత్యసాయిజిల్లా వ్యాప్తంగా ప్రధానకేసులన్నింటపై డిసిఆర్‌బి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్‌పి వి.రత్నసూచించారు. బుధవారం జిల్లాపోలీస్ కార్యాలయంలోని ఎస్‌పి ఛాంబర్ నందు డిసిఆర్‌బి సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశం నందు క్రైం, ఎస్‌సి, ఎస్‌టి,లోకాయుక్త, రౌడీషీటర్స్, చోరీలు, బోర్డర్ పోలీస్ స్టేషన్, క్రిమినల్స్ యాక్టివిటీ, ఫ్యాక్షన్ గ్రామలన్నింటిపై ఎస్‌పి సమీక్షించారు. జిల్లాలోజరిగే నేరాలపై ముందస్తుగా సిబ్బంది తెలుసుకొని అన్ని పోలీస్ స్టేషన్‌లలోని ఆయాసిబ్బంది సమాచారం చేరవేయడంద్వారా నేరాలు నియంత్రించే వీలుందన్నారు. ముందస్తుగా టెక్నాలజీని ఎలా ఉపయోగించుకోవాలో క్షుణ్ణంగా తెలుసుకోవాలన్నారు. అనంతరం సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందరూ సమిష్టిగా పని చేసి మంచి ఫలితాలు సాధించాలి ఎస్‌పి సూచించారు.

ఉద్యోగ ఉపాధ్యాయ దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తిలో సమావేశ మైన వైఎస్ఆర్‌టిఎ నాయకులు

పుట్టపర్తి(కలెక్టరేట్), అక్టోబర్ 09, ప్రభాతవార్త

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు,ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలనుమంత్రి వర్గ సమావేశంలో చర్చించి పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎపివైఎస్ఆర్‌టిఎ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు పి.వి.రమణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పుట్టపర్తిలో నిర్వహించిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. రేపు జరగబోయే మంత్రివర్గ సమావేశంలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్చించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ముఖ్యంగా 30శాతం ఫిట్‌మెంట్‌తో పిఆర్‌సిని అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, వేసవి సెలవుల్లో ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియ నిర్వహించాలని, ఎంటిఎస్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాలు ప్రతి నెల మొదటి వారంలోనే చెల్లించాలని, ఉపాధ్యాయులను, భోధనేతర కార్యక్రమాల నుండి మినహాయించాలని, అనవసర యాప్‌ల భారాన్ని తగ్గించాలనిపెండింగ్‌లో ఉన్న డిఎలలో దసరాకు ఒకటి ప్రకటించాలని, జీవో నెంబర్ 117ఉ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

అన్ని కార్యాలయాలకు ఒకటే రోడ్డు.. అదీ పాడైన రోడ్డు

- సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యాలయంలో వినతి

గోరంట్ల, అక్టోబర్ 9 ప్రభాతవార్త

పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

పట్టణంలోని ప్రధానమైన అన్ని కార్యాలయాలు ఒకేచోట వున్నాయని వాటికి ఒకటే ప్రధానమైన రోడ్డు వున్నప్పటికి అదీ కూడా పాడైపోయి గుంతలమయంగా వారిండని అలాంటి రోడ్డును పట్టించుకునే నాథుడే లేడని వెంటనే సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టు పార్టీ అనుబంధ సంఘమైన వ్యవసాయ కార్మిక సంఘం స్థానిక మేదిరి పంచాయతీ కార్యాలయంలో వినతిపత్రం అందచేశారు. గోరంట్ల మండల కేంద్రంలో రెవెన్యూ, మండల పరిషత్, వ్యవసాయ, ఐకెపి, ఆధార్, బియ్యంగోదాము, ప్రభుత్వ గృహ నిర్మాణశాఖల మండల కార్యాలయాలకు వెళ్లే రోడ్డు పూర్తిగా గుంతలుగా మారి రాళ్లు ఏర్పడ్డాయన్నారు. వివిధ అవసరాల నిమిత్తం వందలాది మంది ప్రజలు వస్తుంటారని మండల పరిపాలన అధికార యంత్రాంగం నిత్యం రాకపోకలు సాగించే ఈ రహదారి అధ్వాన్న స్థితిలో వుండడం ఆశ్చర్యంగా వుందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, వికలాంగులు, పాదచారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి కొద్దిపాటి వర్షానికే బురదమయం అవుతోందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. దీంతో స్పందించిన జూనియర్ అసిస్టెంట్ మాట్లాడుతూ తప్పకుండా తాత్కాలికంగా గుంతలు పూడ్చే పనులు చేపట్టడంతో పాటు సిసి రోడ్డు ఏర్పాటుకు మండల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మికన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణలత, భవన నిర్మాణ కార్మిక సంఘం నియోజకవర్గం కన్వీనర్ కొండా వెంకటేశులు పాల్గొన్నారు.

06ATP27_06ATP27.qxd 09-10-2024 PM 10:55 Page 1

చదువుల తల్లి సరస్వతిగా దర్శనమిచ్చిన అమ్మవార్లు

-మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చిన భగళాముఖి అమ్మవారు

-మూలా నక్షత్రం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త



సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన ఉద్భవలక్ష్మి, ఉరగాద్రి చౌడేశ్వరి, అమ్మవార్లు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్సరం ఆశ్వీయుజ మాసం శుద్ధ షష్టి బుధవారం అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమివ్వగా అమ్మవార్ల దివ్యమంగళ రూపాలను దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. మూలా నక్షత్రం కావడంతో ఉరవకొండ మండలపరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన ఉద్భవలక్ష్మి విద్యాలక్ష్మిగా, పట్టణంలోని ఉరగాద్రి చౌడేశ్వరి, ఈశ్వరమ్మ, దుర్గాభవాని అమ్మవార్లు చదువులతల్లి సరస్వతిదేవి అలంకారంలో దర్శనమివ్వగా వెలిగొండ గ్రామంలోని భగళాముఖిఅమ్మవారు మహిషాసురమర్ధినిగా దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో ఉదయం అభిషేకాలు, నిత్యపూజలు, హోమాలు కొనసాగగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలన్నదే ముఖ్య ఉద్దేశం

-శిక్షణా కార్యక్రమంలో ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్

పాలనపై పట్టు సాధించినప్పుడే గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవడానికి వీలుంటుందన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్ అన్నారు. పట్టణంలోని మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఆర్.జి.ఎస్.ఎ కార్యచరణ ప్రణాళికపై పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండురోజుల శిక్షణాకార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శిక్షణా తరగతులను ప్రారంభించిన ఎంపీడీఓ బి.వి.రవి ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో ముఖ్యంగా తాగునీరు, పారిశుద్ధ్య, వీధి దీపాలు, రోడ్లు, డ్రైనేజీలు ఇతరత్రా మౌళిక వసతులను ప్రజలకు కల్పించడం గ్రామ పంచాయతీల బాధ్యతన్నారు. అయితే వాటిని సమకూర్చాలంటే పాలనపై ముందుగా అవగాహన ఉండటం అవసరమన్నారు. ట్రైనర్లు రమణకుమార్, మహేష్, బాలవెంకటేష్ కామన్ అడ్మినిస్ట్రేషన్ ప్రొసీజర్, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994, గ్రామపంచాయతీ సమావేశాలు, గ్రామసభ,పర్యవేక్షణ, తనిఖీ అధికారలు, చెల్లింపుల విధివిధానాలు, డీపీఓ, డీఎల్‌పీఓ, ఈఓ పీఆర్ఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శి అధికారులు, విధులు, బాధ్యతలు, పారిశుద్ధ్యం, మన వ్యర్థాల నిర్వహణ, గ్రామ పంచాయతీల పాత్ర, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994లోని సెక్షన్8 నుండి 100, జి.ఓ.యం.యస్ నెంబర్ 18, సొంత ఆదాయ వనరులు, తాగునీటి సరఫరా, పంచాతీల పాత్ర, జేజేఎం, వీధి దీపాల ఏర్పాటు, నిర్వహణ, సీసీ చార్జీల చెల్లింపులు, ప్రభుత్వవిధానం అంశాలను కూలంకుశంగా వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అడ్మినిస్ట్రేషన్ అధికారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీను నెరవేర్చిన పయ్యావుల సోదరులు

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త

పెద్ద హమాలీ యూనియన్ కార్యాలయం పైకప్పు వేస్తున్న దృశ్యం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీను రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ జిల్లా నేత పయ్యావుల శ్రీనివాసులు నెరవేర్చారు. పట్టణంలోని ప్రైవేటు బస్టాండ్ ప్రాంతంలోగల పెద్ద హమాలీ యూనియన్ కార్యాలయం పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్షం వస్తే లీకేజీతో హమాలీలు ఇబ్బందులు పడుతుండగా ఎన్నికల అనంతరం నూతన పైకప్పు ఏర్పాటు చేస్తామని నాడు ఇచ్చిన హామీ మేరకు కార్యాలయానికి బుధవారం ఆర్‌సీ స్టాబ్‌ను వేయించి వారు మాట నిలబెట్టుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద హమాలీ యూనియన్ కార్మికులు మంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ జిల్లా నేత పయ్యావుల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ ముష్టూరు బాషా, మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు యం.రామాంజినేయులు, టీడీపీ బూత్ కన్వీనర్ మీనుగ పెద్దన్న, చిన్నమాదుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

- పక్షం రోజులకుపైగా తాగునీటికై ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు

- విలేఖరులతో ఉరవకొండ జెడ్పీటీసీ సభ్యులు గుర్రం సుధాకర్

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ఉరవకొండ మాజీ జెడ్పీటీసీ గుర్రం సుధాకర్

రాష్ట్ర ప్రభుత్వం సమ్మె చేస్తున్న నీలకంఠాపురం శ్రీరామిరెడ్డి తాగునీటి సరఫరా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజల తాగునీటి కష్టాలను దూరం చేయాలని ఉరవకొండ మాజీ జెడ్పీటీసీ సభ్యులు గుర్రం సుధాకర్ కోరారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ కార్మికులు చేసిన పనికి జీతాలు ఇచ్చి ఇతరత్రా సమస్యలు పరిష్కరించాలని సమ్మె చేస్తుండటంతో గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయి దసరా పండుగ పూట ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. కార్మికులు గొంతెమ్మ కోర్కెలు ఏవీ కోరడం లేదని న్యాయబద్ధంగా వారికి రావాల్సిన వాటినే అడుగుతున్నారని అన్నారు. పక్షం రోజులకుపైగా కుళాయిలకు నీటి సరఫరా లేకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు వ్యవసాయ బోర్లపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. తాగునీటి సమస్యపై ఉదాశీనంగా వ్యవహరించడంవల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ఈనెల 14 నుండి పల్లె పండుగ కార్య క్రమం నిర్వహిస్తామని అంటున్నారని దానికంటే ముందే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు నిత్యం స్వచ్ఛమైన తాగునీటిని అందించడంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు కల్పించే మౌళిక వసతుల్లో తాగునీరు ప్రధానమని ఇప్పటికైనా ఆలస్యం చేయడకుండా జిల్లా కలెక్టర్, సంబంధితశాఖ ఉన్నతాధికారులు సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలను పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని జెడ్పీటీసీ సభ్యులు గుర్రం సుధాకర్ కోరారు.

సేవాలాల్ మహారాజ్ పుస్తకావిష్కరణ

గుత్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రపై రచించిన పుస్తకాన్ని బుధవారం సేవాఘడ్‌లోని ఆలయంలో ఆవిష్కరించారు. బెంగుళూరు చెందిన ఎఎస్ఎన్ మూర్తి ఈ పుస్తకాన్ని ఆంగ్లంలో రచించారు. ముందుగా ఈ పుస్తకాన్ని శ్రీసరస్వతీదేవికి సమర్పించారు. ట్రస్ట్ ప్రెసిడెంట్ కె.జగన్నాథరావు చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీంద్రనాయక్, జనరల్ సెక్రటరీ అశ్వత్థనాయక్, ట్రెజరర్ బాలానాయక్, ట్రస్ట్ సభ్యులు రాజేంద్రప్రసాద్ నాయక్, కృష్ణనాయక్, భూక్యా వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతి వేడుకల కరపత్రాల విడుదల

గుత్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గుత్తి పట్టణంలోని ఆర్‌అండ్‌డి అతిథి గృహంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుత్తి టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ నెల 17న గుత్తిలో జరిగే వాల్మీకి మహర్షి జయంతి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకుని వాల్మీకి మహర్షి గుడి నుండి మధ్యాహ్నం 3 గంటలకు వాల్మీకి మహర్షి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం మహామంగళహారతి, తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకులందరూ పెద్దసంఖ్యలో పాల్గొని జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బోయ అంజి, బాచి, బాలకృష్ణ, జక్కలచెరువు నారాయణస్వామి, జక్కలచెరువు ప్రతాప్, లాయర్ సోము, మద్దిలేటి, సుధాకర్, వేణు, వాల్మీకి సూరి, సందీప్, పిల్లెలి క్రిష్ణయ్య, కృష్ణమూర్తి, చెట్నేపల్లి రమేష్, మధు, శంకర్, బేతాపల్లి నాగరాజు, గుత్తి పట్టణ, మండల వాల్మీకులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు

గుత్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని శ్రీసరస్వతీ దేవిగా అలంకరించారు. ప్రధాన అర్చకులు వాసుదేవిశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీషిరిడిసాయిబాబా దేవస్థానంలో సాయినాథున్ని పూసలతో అలంకరించారు. సేవాగడ్‌లో సేవాలాల్ మహారాజ్‌కు పూజలు నిర్వహించారు. రేణుక యల్లమ్మ దేవస్థానం, గుత్తి ఆర్ఎస్‌లోని అమ్మవారిశాల, గౌతమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తమ్మడేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

అమరాపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని తమ్మడేపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి మంజునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరై వారి వారి శాఖల్లో జరుగుతున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సిరికల్చర్ అధికారి వేణుగోపాల్‌నాయక్, పశుసంవర్ధకశాఖ మంజునాథ్, రైతు సేవా కేంద్రాల అధికారులు రమ్య, రాఘవేంద్ర, గ్రామ సర్పంచు గిరిజమ్మ, సదానందగౌడ్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి జయరామప్ప, పంచాయతీ కన్వీనర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

తమ్మడేపల్లి యూనిట్ ఇన్‌చార్జ్ రంగనాథ్ గుండెపోటుతో మృతి

అమరాపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

మృతి చెందిన రంగనాథ్

అమరాపురం మండలం తమ్మడేపల్లి ప్రకృతి వ్యవసాయ విభాగం యూనిట్ ఇన్‌చార్జ్ గుర్రపుకొండ రంగనాథ్ బుధవారం విధులకు వస్తూ గుండెపోటుతో మృతి చెందారు. తమ్మడేపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమానికి వస్తుండగా అమరాపురంలో అకస్మాత్తుగా గుండెపోటుతో రావడంతో అక్కడికక్కడే కుప్పకూలగా తక్షణం ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ప్రకృతి వ్యవసాయ విభాగం మడకశిర డివిజన్ ఇన్‌చార్జ్ పి.రమేష్ అక్కడికి చేరుకుని రంగనాథ్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ప్రగాఢసానుభూతి తెలిపారు. జిల్లా అధికారులు, అమరాపురం వ్యవసాయాధికారి మంజునాథ్, సిబ్బంది రంగనాథ్ కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు.

నవరాత్రుల్లో భాగంగా వీరభద్రస్వామి అలంకారం

అగళి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

శరన్నవరాత్రుల్లో భాగంగా మధువుడి వీరభద్రస్వామిని రోజు ఒక అలంకారంలో అలంకరిస్తున్నారు. బుధవారం నిత్యపూజ స్వామి అలంకారం నిర్వహించారు. వీరభద్రస్వామి అగ్నిగుండంతో పాటు రథోత్సవం ప్రతి ఏటా ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 14న మహోత్సవం, 15న స్వామి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. ఈ వేడులకు ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు.

కరకముక్కల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

విడపనకల్లు, అక్టోబర్ 9 ప్రభాతవార్త

మండలంలోని కరకముక్కల, విడపనకల్లు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి పెన్నయ్య మాట్లాడుతూ వ్యవసాయం విత్తన పంపిణీ గురించి ప్రస్తుతం కంది పూతదశ ప్రారంభమైందని రైతులు వేపనూనె 1500 పిపిఎం లీటర్‌కు 5 గ్రాములు, మోనోక్రోటోఫాస్ 2 ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. దీంతో కాయతొలుచు పురుగుకు సంబంధించి గుడ్డు గాని చిన్న పురుగు వుంటే వెంటనే అదుపులోకి వస్తుందన్నారు. ప్రస్తుతం పప్పుశనగ విత్తన సమయం ఆరంభమైందని ఈ నెలాఖరు వరకు విత్తనం విత్తుకోవచ్చన్నారు. దుక్కి సమయంలో 25 కిలోలు యూరియా 50 కిలోలు ఎస్ఎస్‌పి 25 కిలోలు ఎంఒపి వేసినట్లు అయితే మంచి దిగుబడి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది మల్లీశ్వరి, సురేఖ, రైతులు పాల్గొన్నారు.

అధినేతల ఆదేశంతో స్వగ్రామం రోడ్డుకు మరమ్మతులు

గోరంట్ల, అక్టోబర్ 9 ప్రభాతవార్త

రోడ్డుకు మట్టి వేయిస్తున్న టిడిపి నాయకులు

స్వగ్రామంలో రోడ్డు మరమ్మతు లకు గురై స్థానిక ప్రజలు వాహనదారులు ఇబ్బంది పడు తున్నారు. దీంతో సమస్యను తమ అధినేతల దృష్టికి తీసుకెళ్లి వెంటనే వారి ఆదేశాల మేరకు సొంత ఊరి రోడ్డుకు స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు మరమ్మ తులు చేపట్టి అందరి మన్ననలు పొందారు. గోరంట్ల మండలం పాలసము ద్రం పంచాయతీలో హిందూపురం పాలసముద్రం క్రాస్ ప్రధాన రోడ్డు మరమ్మతులు చేయించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర బిసి సంక్షేమశాఖా మంత్రి సవితమ్మ, హిందూపురం ఎంపి బికె పార్థసారధి ఆదేశాల మేరకు రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ట్రాక్టర్ల ద్వారా గుంతలకు మట్టి తరలించి గుంతలకు మరమ్మతులు చేపట్టారు. ఈ రోడ్డు ఆర్‌అండ్‌బి పరిధిలో లేనందున తాత్కాలిక మరమ్మతులు చేపట్టినట్లు టిడిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ సాధికారిక సమితి మెంబర్ బెల్లాలచెరువు చంద్ర, క్లస్టర్ ఇన్‌చార్జ్ మనోహర్, మండల ఉపాధ్యక్షులు మూర్తి, స్టోర్ డీలర్ గంగాధర్, అంజినప్ప, ఉదయ్, మల్లికార్జున, జయచం ద్రారెడ్డి, ఇర్షాద్ (స్టోర్‌డీలర్), ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పిఎం యశస్వి ఉపకార వేతనాకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి (కలెక్టరేట్), అక్టోబర్ 09, ప్రభాతవార్త

శ్రీసత్యసాయిజిల్లాలో అర్హత కలిగిన 9,10వ తరగతి విద్యార్థులతో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న బిసి, ఈబిసి, సంచార జాతుల కులాలకు చెందిన విద్యార్థులు పి.ఎం.యశస్వి ఉపకార వేతనాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత శాఖ అధికారి నిర్మాల జ్యోతి తెలియజేశారు. అర్హత కలిగిన 9,10వ తరగతి విద్యార్థులు అక్టోబర్ 15వ తేదిలోపు, ఇంటర్మీడియట్ విద్యార్థులు అక్టోబర్ 30వ తేదిలోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.50 లక్షలకు మంచి ఉండరాదని, పూర్తి వివరాలను https://scholarships.gov.in వెబ్ సైట్ నందు చూడవచ్చన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని బిసి, ఇబిసి,సంచార జాతులు, కులాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాలకళ్యాణ ఆశ్రమంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం

సిబ్బందితో మాట్లాడుతున్న వెంకటేశ్వరి

గుంతకల్లు, అక్టోబర్ 9 ప్రభాతవార్త

పట్టణంలోని అమృతవర్షిణి బాలకళ్యాణ ఆశ్రమంలో బుధవారం శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్ట్ జిల్లా బాలల సంరక్షణ అధికారిని వెంకటేశ్వరి బాలలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకుని నాణ్యమైన ఆహారం తీసుకోవాలని వారికి సూచించారు. వాటర్ ట్యాంకులను శుభ్రంగా వుంచి శ్రమదానంపై విద్యార్థులతో గ్రూప్ డిస్కర్సన్ చేయించాలని సిబ్బందికి సూచించారు. చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూషన్‌లో ఈ కార్యక్రమం ఈ నెల 31 వరక కొనసాగుతుందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హోం నిర్వాహకులు రామమూర్తి, వెంకటేశులు, మోహన్‌నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చేగువేరా వర్ధంతి వేడుకలు

గుంతకలు, అక్టోబర్ 9 ప్రభాతవార్త

విప్లవకారుడు చేగువేరా 57వ వర్ధంతి వేడుకలను స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో బివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బివైఎఫ్ఐ గుంతకల్లు ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకీ మాట్లాడుతూ చేగువేరా స్ఫూర్తితో మతోన్మాదాన్ని తరిమిగొట్టి లౌకికవాదాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ఎక్కడ అన్యాయం జరిగినా యువత ముందుండి స్పందించాలని ఆయన చెప్పి యువతకు ఆయన ఆదర్శంగా నిలిచారన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

చేగువేరా చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్‌కు సన్మానాల వెల్లువ

-నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్‌ను సన్మానిస్తున్న టీడీపీ సీనియర్ నాయకులు

ఉరవకొండ ఎంపీడీఓ బి.వి.రవిప్రసాద్‌కు సన్మానాల వెల్లువ కొనసాగుతోంది. పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ బి.వి.రవి ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన టీడీపీ సీనియర్ నాయకులు, పార్టీ మండల అధ్యక్షులు ఎన్.విజయ భాస్కర్, కార్యదర్శి మోపిడి గోవిందు, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, మాజీ ఎంపీటీసీ బి.సుంకన్న, నాయకులు ఈడిగ జగదీష్, తాజుద్దీన్, పల్లా నరసింహులు తోపాటు షేక్షానుపల్లి తండాకు చెందిన టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ కాలేనాయక్, రమేష్‌నాయక్, క్రిష్ణనాయక్, మహేష్‌బాబు తదితరులు వేరు వేరుగా షాలువాలుకప్పి పూలమాలలతో సన్మానించి నూతనంగా బాధ్యతలు చేపట్టినందుకు ఎంపీడీఓకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఉరవకొండ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు గుగ్గిళ్ళ అమరేశ్వర్ షాలువాకప్పి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉరవకొండ ప్రాంతంపై పూర్తి అవగాహన కల్గిన బి.వి.రవిప్రసాద్ ఎంపీడీఓగా రావడంవల్ల మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలకు పరిష్కార మార్గం లభించినట్లైందన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కో ఆర్డినేటర్ ఎం.జయప్రకాష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ఎ.వి.రమణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను సన్మానిస్తున్న విశ్రాంత ఉపాధ్యాయులు తదితరులు

రాకెట్ల పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం దృశ్యం

మండల పరిధి లోని రాకెట్ల పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం జరిగింది. వైద్యులు డాక్టర్ వెంకటేష్ నాయక్ నేతృత్వంలోని వైద్య బృందం గర్భిణీ మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్‌నాయక్, సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్ మాట్లాడుతూ గర్భిణీ మహిళలు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, నిత్యం పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని లేనిపక్షంలో రక్తహీనతను ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. గర్భిణీలు గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోరాదని, కొందరు పరీక్షలు చేయించుకొని గర్భంలో ఉన్నది ఆడపిల్లని తేలితే బ్రూణ హత్యలకు పాల్పడుతున్నారని ఇది చట్టరిత్యా నేరమన్నారు. 21 సంవత్సరాల వయసు వచ్చేవరకు పెళ్లిళ్లు చేయవద్దని బాల్య వివాహాలు చట్ట రిత్యా నేరమన్నారు. బాల వివాహాలవల్ల కుటుంబంలో కలహాలు, అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, ఏఎన్ఎంలు, సీహెచ్ఓ/ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

బంజారా సంస్కృతి, ధర్మ పరిరక్షణకు ప్రధాని మోదీ కృషి అమోఘం

- బంజారా ధర్మ రచన కార్యదర్శి ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త

విలేఖరులతో మాట్లాడుతున్న ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్

సింధూ నాగరికతతో ముడిపడిన బంజారా సంస్కృతి, సంప్రదాయాలు పరిరక్షణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేస్తున్న కృషి అమోఘమని బంజారా ధర్మ రచన కార్యదర్శి ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ దేశంలోని 15 కోట్ల మంది బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ పవిత్ర సమాధి స్థలమైన మహారాష్ట్రలోని పౌరాఘడ్‌లో దేశ చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో 700 కోట్ల రూపాయలతో సంగారా భవనం, సంస్కృతి భవనంతోపాటు మ్యూజియం ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. కనుమరుగవుతున్న కళలకు ప్రధాని మోదీ జీవం పోస్తున్నారని ఆయనకు బంజారాలు రుణపడి ఉంటారన్నారు. దేశ వ్యాప్తంగా ఒకే భాష మాట్లాడుతున్న బంజారాల భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. సేవాలాల్ మహారాజ్ అనంతపురం జిల్లాలోని గుత్తి తాలుకా సేవాఘడ్‌లోని 1739 ఫిబ్రవరి 15న జన్మించారన్నారు. సేవాఘగడ్‌లోనూ పౌరఘడ్‌లో తరహాలో మ్యూజియం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రధాని మోదీ వీలు కల్పించుకొని సేవాఘడ్‌ను సందర్శించి అభివృద్ధి పనులకు చేయూతనందించాలని కోరారు.

ఎంఆర్‌పీఎస్ జిల్లా, తాలుకా నూతన కమిటీల ఏర్పాటు

ఉరవకొండ, అక్టోబర్ 9 ప్రభాతవార్త

నూతన బాధ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న దృశ్యం

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) అనంత పురం జిల్లా, ఉరవకొండ తాలుకా నూతన కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజు తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌

04ATP09_04ATP09.qxd 09-10-2024 PM 10:46 Page 1

తలుపూరు రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

సజావుగా సూపర్ చెక్ పూర్తి చేయాలి - కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ఆత్మకూరు అక్టోబర్ 9 ప్రభాతవార్త

మండల పరిధిలోని తలుపూరులో క్షేత్రస్థాయిలో ఈ-పంట నమోదుపై కలెక్టర్ డా,వినోద్‌కుమార్ సూపర్ చెక్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ తలుపూరు గ్రామానికి చెందిన రైతులు పరమేశ్వర్‌రెడ్డి,పి,గోపాల్ పొలాల్లో ఈ-పంట నమోదుపై సూపర్ చెక్ నిర్వహించి అందులో వచ్చిన డేటాని జిల్లా కలెక్టర్ నిర్ధారించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సజావుగా,సకాలంలో సూపర్ చెక్ నిర్వహించి గడువులోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారును ఆదేశించారు.రైతులతో మాట్లాడుతూ భూమి విస్తీర్ణం ఎంత ఉంది,ఏ పంట సాగు చేశారు,ఎప్పుడు సాగు చేశారు,బోరు ఉందా,డ్రిప్ వేసుకున్నారా తదితర వివరాలును అడిగి తెలుసుకున్నారు.అనంతరం తలుపూరులోని రైతు సేవా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తనిఖీ చేశారు. ఖరీఫ్ 2024లో ఈ-పంట నమోదు వివరాలును అధికారులను ఆరా దీశారు. ఎక్కడైనా తప్పు వివరాలు కనిపెట్టారా, పంట లేకపోయినా ఉందని చెప్పుతున్నారాని తదితర వివరాలును తెలుసున్నారు.సూపర్ చెక్‌కు వెళ్ళినప్పుడు తప్పులు కనిపెడితే వారికి నోటసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా సూపర్‌చెక్ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ఉమా మహేశ్వరమ్మ,ఎడిఎ రవి,తహశీల్దార్ లక్ష్మీనాయక్, ఎంపిడిఓ లక్ష్మీనరసింహ,టెక్నికల్ ఆఫీసర్ శంకర్‌లాల్,ఏఓ సుచరిత,ఏఈఓ సుజిత,అధికారులు సుధాకర్‌రెడ్డి, హెచ్‌ఈఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పంటలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్,అధికారులు

రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

ఆ ఆరు గ్రామాల్లో ఈ క్రాప్ బుకింగ్ తనిఖీ

- గోరంట్ల మండలంలో పర్యటించిన జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

గోరంట్ల,
అక్టోబర్ 9 ప్రభాతవార్త

గోరంట్ల మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి ఈ క్రాప్ బుకింగ్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గోరంట్ల మండలంలోని పాలసముద్రం, పులేరు, మలసముద్రం, మల్లాపల్లి, గౌనివారిపల్లిలో జరుగుతున్న పనితీరును జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ క్రాప్ బుకింగ్ విధానంలో భాగంగా సూపర్ చెక్ రికార్డ్స్‌ను పరిశీలించి పలు విషయాలపై సంబంధిత అధికారులకు సూచనలు సలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు అల్తాఫ్ అలీఖాన్, మండల వ్యవసాయాధికారి మునికృష్ణ, తహశీల్దార్ మారుతిప్రసాద్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

ఈ నెల 14 నుండి 19వరకు పల్లె పండుగ వారోత్సవాలు

కొత్తచెరువు, అక్టోబర్ 09,ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సమగ్ర గ్రామీణ అభివృద్ధే లక్ష్యంగా ఈ నెల 14వ తేది నుండి 19వ తేది వరకు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. ఇందులో భాగంగా పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.20 కోట్లతో అన్ని పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యంలో సిసి రోడ్డు, డ్రైనేజీ,కల్వర్టుల నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీమంత్రి పల్లె రఘు నాథ్ రెడ్డి హాజరవుతారన్నారు. ఈ నెల 14వ తేది ఉదయం 10 గంటలకు కొత్తచెరువు పంచాయతీ అభివృద్ధి పనులకు, అదే రోజున మండల పరిధి లోని కె.లోచర్ల గ్రామంలో పంచాయతీ అభివృద్ధి పనులకు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి భూమిపూజ చేయడం జరుగుతుందన్నారు. కావున తెదేపానాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

గ్రంథాలయము ఆకస్మిక తనిఖీ

బుక్కరాయసముద్రం,
అక్టోబర్ 9 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం గ్రంథాలయంను బుదవారం గ్రంథాలయం శాఖ అదికారి రమ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాంగా గ్రంథాలయంనకు సంబందించిన రికార్డులను పరిశీలించి రికార్డులు సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తపరిచారు. అనంతరం వారు మాట్లడుతూ ప్రతి రోజు ఎంత మంది పాఠకులు వస్తున్నారు. పాఠకులకు కావలసిన సౌఖ్యర్యాలు అన్ని ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.గ్రంథాలయా సైన్స్ వసూళ్ళ పై దృష్టి కేంద్రీకరించాలని సూసించారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయం శాఖ అదికారి విజయభాస్కర్ పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న గ్రంథాలయశాఖ అదికారి రమ

ఏడిసీఏ ఇంటర్ డిస్ట్రిక్ అండర్-14 జట్టు ఎంపిక

- ఏడిసీఏ సెక్రటరీ కె.మధు ఆచారి

ఏడిసీఏ ఇంటర్ డిస్ట్రిక్ అండర్-14కు ఎంపికైన జట్టు

అనంతపురం క్లాక్‌టవర్,అక్టోబర్9,ప్రభాతవార్త: అనంతపురం డిస్ట్రిక్ క్రికెట్ అసోసియేషన్ ఏడిసీఏ అండర్-14 డిస్ట్రిక్ టీమ్ ఎంపిక చేయబడింది. అక్టోబర్ 10 నుండి 23 వరకు మ్యాచ్‌లు నరసరావ్‌పెట్, మంగళగిరి, పేరేచర్లలో జరిగే ఏసీఏ ఇంటర్ డిస్ట్రిక్ క్రికెట్ టోర్నమెంట్ గ్రూప్ బీలో అనంతపురం జట్టు పాల్గొంటుంది.ఏడిసీఏ సెక్రటరీ మధు ఆచారి జట్టు జాబితాను ప్రకటించారు.టి.కిరణ్ కుమార్(కెప్టెన్),ఆశిష్ ఆచారి(వైస్ కెప్టెన్), సి.గోకుల్,ఆర్.ఆదినారాయణరెడ్డి,ఎ.హేమచంద్ర నాయక్,ఇ.రోహిత్,పంకజ్ మీనా,పి.భువన్‌రెడ్డి,ఎస్.కార్తీక్,పి.హేమంత్ కుమార్ యాదవ్, ఎస్,ప్రణధీర్, వై.లికిత్,యు.దేవ స్కంద,వెంకట్ సాయి,ఎం.దేవాన్స్ రోహిత్, ఉత్తేజ్ యాదవ్ మరియు కోచ్ కుమార్,స్టాండ్ బైలుగా పునీత్, దీపక్‌రెడ్డి,ప్రతీక్, నీహార్,వి.రంజీత్ కుమార్,ముఖేష్, హర్షకుమార్‌లరు ఎంపిక చేశారు.

కుణే రామలింగేశ్వరున్ని దర్శించికున్న ఎంయల్ఎ,ఎంపి

శెట్టూరు, అక్టోబర్ 09 ప్రభాతవార్త,

మండంలోని యాటకల్లు గ్రామంలో వెలసిన కుణే రామలింగేశ్వరున్ని భుధవారం దర్శించికున్న ఎంయల్ఎ అమిలినేని సురేంద్రబాబు, ఎంపి అంభికా అక్ష్మీ నారాయణ దర్శించుకొన్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా కొలిచే కుణే రామలింగేశ్వరసామిని దర్శించుకొన్న అనంతరం అలయంలో కళ్యాణ మంటపంను పరిశీలించారు అరకొరగావున్న కళ్యాణ మంటపంకు నిధులు పంజూరుచేసి కళ్యాణమంటపంను పూర్తిచేస్తానని హామీ ఇచ్చారు.

లేపాక్షిలో పర్యాటక అభివృద్ధి టూరిజయం శాఖ లక్ష్యం

- ప్రత్యేక చొరవ తీసుకుంటున్న కలెక్టర్ చేతన్

- టూరిజం శాఖ జిల్లా అధికారి జయకుమార్‌బాబు

లేపాక్షి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

లేపాక్షిని పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేయడమే టూరిజంశాఖ ప్రధాన లక్ష్యమని టూరిజం శాఖ జిల్లా అధికారి జయకుమార్‌బాబు పేర్కొన్నారు. పర్యాటక అతిథిభవనంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేపాక్షిని పర్యాటక రంగంలో మరింత అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ చేతన్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురు, శుక్రవారాల్లో సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో సాంప్రదాయ నృత్యాలు, తోలుబొమ్మలాట, సంగీత కార్యక్రమాలు వుంటాయన్నారు. అదేవిధంగా పర్యాటకులను పెంచే భాగంగా హరిత హోటల్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. త్వరలో హరిత హోటల్ మరింత అభివృద్ధి చేస్తామన్నారు. లేపాక్షి ఆలయానికి పర్యాటకంలో మరింత గుర్తింపు తెచ్చేందుకు పండుగ సమయంలోనూ టూరిజంశాఖ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ చేతన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. అదేవిధంగా శివరాత్రి జాగరణ రోజున టూరిజం శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని ఆయన తెలియచేశారు.

టూరిజం శాఖ జిల్లా అధికారి జయకుమార్‌బాబు

ఎంపీడిఓ సాల్మన్‌రాజు ను కలసిన టిడిపి నాయకులు

ఎంపీడిఓను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

బుక్కరాయసముద్రం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండలంనకు బదిలీ పై వచ్చిన ఎంపీ డిఓ సాల్మన్ ను బుదవారం టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా ఆయనను కలసి బొకేలు శాలవాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగ ఆయన మాట్లడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజల సమస్యల తీరుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాము,జొన్న రామ య్య, టిడిపి మాజి మండల కన్వీనరు దండువారిపల్లి ఆదినారాయణ, పొడరాళ్ళ రవీంద్ర, ఓబులపతి, మేకల రామక్రిష్ణగౌడ్, నారాయణస్వామి, సుబ్బరాయుడు, జూటూరు సంజప్ప, గోపాల్, సూర్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారు

పామిడి అక్టోబర్ 9 ప్రభాతవార్త

వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు దశరా శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ సరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అష్టోత్తరపూజలు చేపట్టారు. పురాణా గాధల మేరకు మాఘ మాసం వసంతపంచమి రోజున దసరా ఉత్సవాల్లో మూల నక్షత్రం రోజు బ్రహ్మ సతీమణి శ్రీ సరస్వతిపూజలు చేస్తారన్నారు. తెల్లటి చీర,వీణ ధారణ,మాల పుస్తక ధారణ తెల్లపూలతో అమ్మవారిని అలంకరించి ప్రాతఃకాల అభిషేకం,అర్చన కుంకుమపూజలు లలిత సహస్ర నామ పారాయణం గావించారు.అనంతరం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి ఆయుర్వేద వైద్యశిబరాన్ని నిర్వహించారు.అష్టలక్ష్మీ అవిర్భావం బాలలతో నాటక ప్రదర్శనలో విజేతలైనా బాలలకు బహుమతులు అందజేశారు.ప్రభుత్వ ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కృష్ణవేణి, హోర్మోనిస్ట్ రామకృష్ణని ఆర్యవైశ్య సంఘం వారు ఘనంగా సత్కరించారు. అపోపా క్యాలండర్ ఆవిష్కారించారు.శ్రీ సరస్వతిదేవిగా దర్శనమిస్తున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న భక్తులు అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.వాసవీ మాతృ మండలి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

ఉత్సవాల్లో పాల్గొన్న పెండ్యాల శ్రీలత

అనంతపురం ఓల్డ్‌టౌన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

అనంతపురం నగరంలోని సుభాష్‌రోడ్డులో గల శ్రీకృష్ణ దేవరాయ భవన్ ప్రాంగణంలో అనంతపురం అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కోఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై వుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నగర ప్రధాన కార్యదర్శి రోళ్ల భాస్కర్, వీరమహిళ, అర్బన్, బ్యాంకు డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పూజల్లో పాల్గొన్న పెండ్యాల శ్రీలత

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి ఎంపిడిఓ తేజోష్ణ

పామిడి
అక్టోబర్ 9 ప్రభాతవార్త

గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపిడిఓ తేజోష్ణ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం నందు గ్రామపంచాయితీల ఉప సర్పంచులకు,వార్డు మెంబర్లుకు రెండు రోజులు పాటు జరుగు నున్న శిక్షణా తరగతులను బుధవారం ఎంపిడిఓ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయితీ వ్యవస్థను బలోపేతం చేస్తూనే గ్రామీణాభివృద్ధికి పాటుపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణకుమార్,గ్రామ పంచాయితీ ఉప సర్పంచులు,వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న ఎంపిడిఓ తేజోష్ణ

సరస్వతీదేవిగా వద్దిరాల పెద్దమ్మతల్లి

యాడికి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని అమ్మవారి ఆలయాల్లో బుధవారం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఉదయం యాగశాల ప్రవేశము, మహాగణపతిపూజ, గంగపూజ, నవగ్రహ జపములు హోమం, దేవి అభిషేకం, రుద్రాభిషేకం, సుందరకాండ పారాయణము, సహస్ర కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. సాయంత్రం ప్రదోషపూజ, అంకురార్పణ శతనామ కుంకుమార్చన, అమ్మోరు పల్లకిసేవ, వేద పారాయణము, స్వస్తి పఠనము, విశేష హారతులు, తీర్థప్రసాద వినియోగం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శ్రీకన్యకాపరమేశ్వరి, పెద్దతల్లికి ప్రత్యేకంగా అలంకరించారు. రాయలచెరువు గ్రామంలోని యల్లమ్మతల్లిని శ్రీసరస్వతీదేవి అలంకారంలో అలంకరించారు. రామరాజుపల్లి వద్దిరాల పెద్దమ్మతల్లిని సరస్వతీదేవి అలంకారంలో అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నూతన ఇఒగా రామాంజినేయులు

తాడిపత్రిరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ఇఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామాంజినేయులు

మండలంలోని ఆలూరుకోన దేవస్థానం నూతన ఇఒగా రామాంజినేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఇఒ రామాంజినేయులు ఆలూరుకోనతో పాటు రూరల్ పరిధిలోని గంగాదేవిపల్లి శ్రీగంగాభవాని దేవస్థానం, తాడిపత్రి పట్టణంలోని పురాతన ఆలయాలైన శ్రీచింతల వేంకటరమణస్వామి, శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయాలకు ఇఒగా విధులు నిర్వహించనున్నారు.

గర్భవతులకు భోజన వసతి ఏర్పాటు

గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

యాడికి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

మండలంలోని రాయలచెరువు గ్రామంలోని ప్రభుత్వ వైద్యశాలలో బుధవారం దాతలు డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, ఏఐజి ఆసుపత్రి హైదరాబాద్, పారిశ్రామికవేత్త సివి రమణారెడ్డి, రంజిత్‌కుమార్‌లు భోజన వసతిని కల్పించారు. ఈ సందర్భంగా విద్యాధికారులు శ్రీరామ్‌కుమార్, పరమేష్, అప్పయ్యలు గర్భవతులకు వైద్యపరీక్షలు నిర్వహించి తగిన సూచనలు సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది జుబేదా, వెంకటలక్ష్మి, ప్రసాద్‌గౌడ్, సుమతీదేవి, షబ్బీర్‌అహ్మద్, సరోజమ్మ, సాయిలత, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంపిడిఓను సన్మానించిన సర్పంచు

నూతన ఎంపిడిఓను సన్మానిస్తున్న సర్పంచు మారికె రామలక్ష్మమ్మ

యాడికి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఓ వీర్రాజును కోనఉప్పలపాడు గ్రామ పంచాయతీ సర్పంచు రామలక్ష్మమ్మ శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఇఒఆర్‌డిగా శశికళ, కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన వారిని కూడా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రామాంజినేయులు, గోపాల్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, క్షేత్ర సహాయకుడు గాంధీ, డీలర్లు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసరస్వతిదేవి అలంకారంలో గాయత్రిమాత

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సంజీవనగర్ జీరోరోడ్డులో వెలసిన శ్రీవేదమాతగాయత్రిదేవి అమ్మవారు బుధవారం శ్రీసరస్వతిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీసరస్వతిదేవిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

శ్రీలలితాదేవి అలంకారంలో రాజరాజేశ్వరి

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన శ్రీబుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మవారు బుధవారం శ్రీలలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, నందుస్వామి, రామకృష్ణశర్మలు అమ్మవారికి కుంకుమార్చనలు, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమ్మవారిని శ్రీలలితాదేవిగా అలంకరించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇసుక ట్రాక్టర్లును పట్టుకున్న ఆత్మకూరు ఎస్ఐ

ఆత్మకూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లును పట్టుకున్న దృశ్యం

కాలువపల్లి నుంచి అనంత పురంకు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును పట్టుకున్నట్లు బుధవారం ఆత్మకూరు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు మేరకు కాలువపల్లి యేరు నుంచి అనంత పురంకు అక్రమంగా రెండు ట్రాక్టర్లు ద్వారా ఇసుకను రవాణా చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు యజమానులు,డ్రైవరులైనా దేవపుత్ర, రాజశేఖర్, నరేష్, జయప్రసాద్‌లపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపినట్లు ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలియజేశారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి

యల్లనూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి

పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ఇన్‌చార్జ్ ఎంపిడిఓ వాసుదేవిరెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపిడిఓ మాట్లాడుతూ గ్రామాల్లో మౌళిక వసతులు ఏర్పాటు వనరుల ఆదాయం విధుల బాధ్యత గ్రామ ప్రజల ప్రాధాన్యత ప్రకారం నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుందన్నారు. అలాగే పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్ల ఏర్పాటుకు ప్రాధాన్య ఇవ్వాలని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ షబ్బీర్‌బాష, పంచాయతీ కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన తాడిపత్రి విద్యార్థులు

పతకాలు సాధించిన విద్యార్థులు

తాడిపత్రిటౌన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

తిరుపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన అండర్-14, అండర్-17 బాల, బాలికల రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో పోటీల్లో తాడిపత్రికి చెందిన విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించినట్లు స్పోర్ట్స్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి సాయిబాబా తెలిపారు. ఇందులో భాగంగా 42 కిలోల విభాగంలో లలిత (సాయిచైతన్యస్కూల్) కాంస్య పతకం, 35 కిలోల విభాగంలో తబ్రేజ్ (శ్రీవాణి హైస్కూల్) రజతం, 78 కిలోల విభాగంలో రాకేష్ (చర్చి హైస్కూల్)కాంస్య పతకం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ పోటీలకు జిల్లా టీం కోచ్‌లుగా నరేష్, షెక్షావలి ప్రాతినిధ్యం వహించినట్లు ఆయన తెలిపారు.

ఎంపీడిఓ సాల్మన్‌రాజును కలసిన టిడిపి నాయకులు

ఎంపీడిఓను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

బుక్కరాయసముద్రం,
అక్టోబర్ 9 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండలంనకు బదిలీ పై వచ్చిన ఎంపీడిఓ సాల్మన్ ను బుదవారం టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా ఆయనను కలసి బొకేలు శాలవాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగ ఆయన మాట్లడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటు ప్రజల సమస్యల తీరుస్తామన్నారు.ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాము,జొన్న రామయ్య, టిడిపి మాజి మండల కన్వీనరు దండువారిపల్లి ఆదినారాయణ,పొడరాళ్ళ రవీంద్ర, ఓబులపతి, మేకల రామక్రిష్ణగౌడ్, నారాయణస్వామి, సుబ్బ రాయుడు, జూటూరు సంజప్ప, గోపాల్, సూర్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు

- పూజల్లో పాల్గొన్న శాశ్వత లోక్‌అదాలత్ జడ్జి శ్రీనివాసరావు

పూజల్లో పాల్గొన్న దృశ్యం

అనంతపురం ఓల్డ్‌టౌన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త

నగరంలోని సుభాష్‌రోడ్డులో గల శ్రీకృష్ణదేవరాయ భవన్ ప్రాంగణంలో అనంతపురం అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ జడ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను అర్బన్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించడం శుభ పరిణామమన్నారు. ఇందులో భాగంగా తనకు అమ్మవారి దర్శన భాగ్యం కలిగించినందుకు అనంతపురం అర్బన్‌బ్యాంకు పాలకవర్గం వారికి ధన్యవాదాలు తెలియచేశారు. 100 సంవత్సరాల చరిత్ర కలిగిన అర్బన్ బ్యాంకు సేవలు అనంత నగర ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలన్నారు, బ్యాంకుకు సంబంధించి లోన్‌దారులు సకాలంలో లోన్లు చెల్లిస్తే బ్యాంకు ఆర్థిక పురోగతి చెందుతుందని బ్యాంకుకు కావాల్సిన మొండి బకాయి కేసులు సత్వరమే పరిష్కార మార్గాలు శాశ్వత లోక్‌అదాలత్ ద్వారా జరుగుతాయని ఈ విషయాన్ని ప్రజలు తెలుసుకోవాలని ఆయన తెలియచేశారు. సాయంత్రం జరిగిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మన్లు గోల్డ్ బాష, పాలకవర్గం సభ్యులు రోళ్ల భాస్కర్, మాగిశెట్టి చంద్రశేఖర్, కృష్ణకుమార్, బావిగడ్డి రమణయ్య, సుంకర రమేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మ